ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 కర్నూలు
జిల్లా వార్తలు
బుధవారం 17 జనవరి 2024

ఐదుగురు తహసీల్దార్ల బదిలీ

కర్నూలు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో జోన్-4లో పలువురు తహసీల్దార్లు బదిలీ అయ్యారు. జోన్-4లో మొత్తం 21 మందిని బదిలీ చేస్తూ సీసీఎల్ఏ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా కర్నూలు జిల్లా నుంచి ప్రస్తుతానికి ఐదుగురిని బదిలీ చేశారు. ఈ మేరకు సంబంధిత కలెక్టర్లకు తహసీల్దార్లు రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. పత్తికొండ తహసీల్దార్‌గా పద్మజ, కోసిగికి మురళి, కౌతాళంకు అలెగ్జాండర్, పెద్దకడబూరుకు వి.సురేశ్‌బాబు, చిప్పగిరి తహసీల్దారుగా రామాంజులు నాయక్ నియమితులయ్యారు.

మాపై ఈ కక్ష సాధింపు ఎందుకు?

సాష్టాంగ నమస్కారం చేస్తూ అంగన్‌వాడీల నిరసన



సాష్టాంగ నమస్కారం చేస్తున్న అంగన్‌వాడీలు

కర్నూలు(హాస్పిటల్), జనవరి 16: తమపై ప్రభుత్వం ఎందుకు ఇంత కక్ష సాధింపుతో వ్యవహరిస్తోందని అంగన్‌వాడీ ఉద్యోగులు ప్రశ్నించారు. వారి మంగళవారం సమ్మె 36వ రోజుకు చేరింది. సంక్రాంతి పండుగ రోజు కుటుంబంతో సంతోషంగా గడపాల్సిన అంగన్‌వాడీలు ఎండలో రోడ్డెక్కి సమ్మె చేశారు. కర్నూలు శ్రీకృష్ణదేవరాయల సర్కిల్ ధర్నా చౌకులో దీక్షా శిబిరంలో అంగన్‌వాడీ ఉద్యోగులు మోకాళ్లపై నిలబడి సాష్టాంగ నమస్కారం చేస్తూ వినూత్నంగా మా సమస్యలు పరిష్కరించండి.. జీతాలు పెంచండి అని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోవడం అన్యాయమని అన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్. మునెప్ప, సీఐటీయూ నగర కార్యదర్శి సీహెచ్ సాయిబాబా, మాట్లాడుతూ 36 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి ఏ మాత్రం కనికరం లేదని, దీని వల్ల సంక్రాంతి పండుగ రోజు కూడా తమ ఆందోళనలను కొనసాగిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం ఆరుసార్లు చర్చలు జరిపినా వీటిలో కనీస వేతనాలు, గ్రాట్యుటీ అమలుకు సంబంధించిన విషయాలను చర్చించ లేదన్నారు. ఒక పక్క సమ్మెను అణచివేయడానికి అత్యవసర సర్వీసుల చట్టం కింద అంగన్‌వాడీలను చేరుస్తూ జీవో.నెం.2ను తీసుకురావడం, వారి ఇళ్ల వద్ద బలవంతంగా నోటీసులు ఇళ్ల దగ్గర, సెంటర్ల దగ్గర అతికించడం, డ్యూటీలు చేయాలని బెదిరించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి ఏ.చంద్రశేఖర్, సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు కె.సుధాకరప్ప, అంగన్ వాడీ యూనియన్ నాయకులు చౌడేశ్వరమ్మ, విజయలక్ష్మి, విజయమ్మ పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధించాలి

హైకోర్టు జడ్జి జస్టిస్ ఎన్.హరినాథ్‌రెడ్డి



జస్టిస్ హరినాథ్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

పగిడ్యాల, జనవరి 16: యువత ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానిని కష్టపడి సాధించి ఉన్నతమైన స్థానంలో నిలవాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. హరినాథ్ రెడ్డి అన్నారు. ప్రాతకోట గ్రామానికి చెందిన బాలవెంకటరెడ్డి, కృష్ణవేణి కుమారుడు హరినాథ్‌రెడ్డి దంపతులను మండల పరిధిలోని తూర్పు ప్రాతకోట గ్రామంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి కర్నూలు జిల్లా అదనపు కోర్టు జడ్జి భూపాల్‌రెడ్డి, నందికొట్కూరు సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని, ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, టీడీపీ నియోజకవర్గ నాయకుడు బండి జయరాజు, నందికొట్కూరు, నంద్యాల, కర్నూలు బార్ అసోసియేషన్ సభ్యులు హాజరై ఆయనను ఘనంగా సన్మానించారు. మారుమూల గ్రామమైన ప్రాతకోటకు చెందిన హరినాథ్‌రెడ్డి హైకోర్టు జడ్జి కావడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు ప్రోత్సాహంతోనే ఈ స్థితిలో ఉన్నానని అన్నారు. గ్రామీణ యువత ఒక లక్ష్యాని నిర్దేశించుకొని ప్రయోజకులు కావాలన్నారు. కష్టపడి చదువుతే సరిపోదని, లక్ష్యం ఉండాలని, అప్పుడే ఏదైనా సాధించవచ్చు అని అన్నారు.

కైలాస వాహనంపై శివపార్వతులు



కైలాసవాహనంపై ఆదిదంపతులు



హరిదాసు సందడి





- కనుమ రోజున శ్రీశైలంలో గోపూజ
- కన్నులపండువగా లీలా కల్యాణోత్సవం
- నేడు యాగపూర్ణాహుతి, ధ్వజావరోహణ



శ్రీశైలం, జనవరి 16: శ్రీశైలం మహాక్షేత్రంలో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు కైలాసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు జరిపారు. అనంతరం చండీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, జపాలు, రుద్రపారాయణలు, చతుర్వేదపారాయణాలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కైలాసవాహనంపై ఆశీనులు చేసి అర్చకులు, వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ వెలుపలకు తోడ్కొని వచ్చి క్షేత్రవీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కనుమ సందర్భంగా ఆలయంలో గోపూజను ఘనంగా నిర్వహించారు. ఇదిలా ఉండగా సోమవారం సంక్రాంతి రోజున స్వామి, అమ్మవార్ల లీలా కల్యాణోత్సవం కన్నులపండువగా సాగింది. శివపార్వతుల కల్యాణోత్సవానికి చెంచు భక్తులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చెంచు భక్తులు నూతన వస్త్రాలను, వెదురు బియ్యం, ఈతాకులతో రూపొందించిన బాసికాలు, స్వామివారి యజ్ఞోపవీతం, అమ్మవారి వడ్డాణం, ఇతర సామగ్రిని సమర్పించారు. అనంతరం ఉత్సవమూర్తులు నందివాహనంపై విహరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో పెద్దిరాజు, ఉభయదేవాలయాల అర్చకులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు. స్వామివారి సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం యాగ పూర్ణాహుతి, ధ్వజావరోహణ కార్యక్రమాలు జరగనున్నాయి.



మహిళల కోలాటాలు

ఘనంగా రామలింగేశ్వరుడి రథోత్సవం

జనసంద్రమైన రాంపురం

మంత్రాలయం, జనవరి 16: గోవింద, శివనామస్మరణతో రాంపురం మారుమ్రోగింది. తుంగభద్ర నది ఒడ్డున రాంపురం గ్రామంలో కొలువైన రామలింగేశ్వర స్వామి రథోత్సవం కన్నులపండువగా సాగింది. ఈ ఉత్సవానికి భక్తులు వేలాదిగా తరలిరావడంతో గ్రామం జనసంద్రమైంది. రాంపురం రెడ్డి సోదరులు, ఆలయ ధర్మకర్తలు పాటిల్ లలితమ్మ, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం ఎమ్మెల్యేలు వెంకట్రామిరెడ్డి, సాయిప్రసాద్ రెడ్డి, బాలనాగిరెడ్డిలతో పాటు ఆంధ్ర, కర్ణాటక మఠాలకు చెందిన పీఠాధిపతులను వాహనంపై ఆలయం వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. రాంపురం రెడ్డి సోదరులు ఇంటి నుంచి ఉత్సవమూర్తి ఆలయం వరకు చేరుకుని అక్కడ పూజలు చేసి మహారథంపై అధిష్ఠించారు. మహారథం ముందుకు సాగుతుండగా నందికోల నృత్యాలు, కోలాటాలు, ప్రత్యేక నృత్యాల వేషధారణలు, బొమ్మల ప్రదర్శనలు మంగళవాయిద్యాలు, బీరప్పడోళ్లు, తప్పెట్ల కళాకారులు ఆకట్టుకున్నారు. ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య, మంత్రాలయం సీఐ ఎరిషావలి, మాధవరం, మంత్రాలయం ఎస్ఐలు కిరణ్‌బాబు, వేణుగోపాల్ రాజు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. మంచాల సొసైటీ అధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి, భీమా యూత్ నాయకులు ధరణీధర్ రెడ్డి, భీమారెడ్డి, మనోజ్‌రెడ్డి, నైరుద్‌రెడ్డి, నాయకులు గురెడ్డి భీమిరెడ్డి, బాబురెడ్డి, మురళీధర్ రెడ్డి, వ్యవసాయ మండలి చైర్మన్ సీవీ విశ్వనాథ్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ రాజశేఖర్ రెడ్డి, పురుషోత్తంరెడ్డి, కృష్ణారెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జనసందోహనం నడుమ రామలింగేశ్వర స్వామి రథోత్సవం



ఉత్సవమూర్తిని తలపై పెట్టుకుని మోసుకుని వస్తున్న సాయిప్రసాద్ రెడ్డి



మహారథం ఉత్సవానికి వస్తున్న ఎమ్మెల్యేలు

పత్తికొండ వైసీపీలో మూడుముక్కలాట


వైసీపీకి వర్గసెగ..!

పత్తికొండ, జనవరి 16: పత్తికొండ వైసీపీలో ఘర్షణ కొనసాగుతోంది. టికెట్ కోసం ఒకరిపై ఒకరు నేతలు కత్తులు దూసుకుంటున్నారు. అధినేత వద్ద మెప్పుకోసం ఒకరు.. అధిష్ఠానంలో పలుకుబడి కోసం మరొకరు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. మొత్తం మీద పత్తికొండ వైసీపీలో అంతా కలసి ఉన్నట్టు కనిపిస్తారు కానీ... ఎవరి కుంపటి వాళ్లదే. పార్టీలో గ్రూపుల గోల ఎక్కువ కావడంతో కేడర్ అయోమయానికి గురవుతోంది. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ సుబ్బారెడ్డి కుమార్తె, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, వైసీపీ సీనియర్ నాయకుడు పోచిమిరెడ్డి మురళీధర్ రెడ్డి ఎవరికివారే టికెట్ కోసం పావులు కదుపుతున్నారు. మళ్లీ తానే ఎమ్మెల్యే అభ్యర్థినంటూ ఇప్పటికే శ్రీదేవి ప్రకటించగా... తాను బరిలో నిలవడం పక్కా అంటున్నారు నాగరత్నమ్మ. ఇక వైసీపీ నాయకుడు మురళీధర్ రెడ్డి ఓ అడుగు ముందుకేసి.. 'టికెట్ నాకే ఒకే' చేశారంటూ ప్రకటించేసుకున్నారు. ఇలా పత్తికొండ నియోజకవర్గం వైసీపీలో జరుగుతున్న మూడుముక్కలాటలో ఆ పార్టీ కేడర్ అయోమయానికి గురవుతోంది.



- రచ్చకెక్కుతున్న విభేదాలు
- ఎన్నికల బరిలో ఉంటానంటున్న నాగరత్నమ్మ
- తనకే టికెట్ అని ప్రకటించుకున్న పోచిమిరెడ్డి
- ఎమ్మెల్యే శ్రీదేవికి కష్టకాలం

పత్తికొండ టికెట్‌పై పోచిమిరెడ్డి ఆశలు



ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కుటుంబంతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్న వైసీపీ నాయకుడు పోచిమిరెడ్డి మురళీధర్ రెడ్డి తనకే టికెట్ ఖరారైందంటూ జనవరి ఒకటో తేదీన బహిరంగ ప్రకటన చేసి సంచలనం సృష్టించాడు. టికెట్ కోసం ఇప్పటికే అమరావతికి వెళ్లి పలుమార్లు కీలక నేతలను కలిసి మాట్లాడి ప్రయత్నించినట్లు ఆయన చెబుతున్నారు. ఇదిలా ఉండగా హత్యకు గురైన చెరుకులపాడు నారాయణ రెడ్డిని వైసీపీలోకి తేవడంతోపాటు ఆ తర్వాత 2019లో శ్రీదేవి గెలుపుకోసం పనిచేసిన తనను అణచివేసే చర్యలకు ఎమ్మెల్యే పాల్పడుతున్నారంటూ ఆయన నేరుగా ముఖ్యమంత్రి జగన్‌కే ఫిర్యాదు చేసినట్లు చేశారు. ఈ క్రమంలో తనకు టికెట్ ఇవ్వాలంటూ ఆయన అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

ఎమ్మెల్యే శ్రీదేవికి 'అసమ్మతి' అవస్థలు



2019 ఎన్నికల్లో హత్యకు గురైన అప్పటి వైసీపీ ఇన్‌చార్జ్ చెరుకులపాడు నారాయణరెడ్డి అంత్యక్రియలకు వచ్చిన జగన్‌మోహన్ రెడ్డి... శ్రీదేవికి టికెట్ ఇస్తున్నట్లు ప్రకటించారు. నారాయణరెడ్డి హత్య నేపథ్యంలో 2019 ఎన్నికల్లో శ్రీదేవికి సానుభూతి ఓట్లతో విజయం సాధించింది. అయితే నియోజకవర్గంలో సొంత వర్గాన్ని ఏర్పాటు చేసుకునేందుకు గత ఎన్నికల్లో సహకారం అందించిన నాయకులను ఆమె మొదటి నుంచి ఇబ్బందులకు గురిచేస్తూ వచ్చిందని నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. దీనికి తోడు తనసొంత సామాజిక వర్గానికి చెందిన నాయకులకే పనులు అప్పచెబుతూ మిగిలిన వారిని చిన్నచూపుచూస్తూ వస్తున్నారన్న ఆవేదన వైసీపీలోని మెజార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్న వైసీపీ కేడర్‌కు మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, వైసీపీ నాయకుడు పోచిమిరెడ్డి మురళీధర్ రెడ్డి వర్గాలు బాసటగా నిలిచాయి. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఉన్న వైసీపీ శ్రేణులను తమవైపు లాక్కుని ఎవరికి వారు రాజకీయం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే శ్రీదేవికి వ్యతిరేకంగా రెండు వేరు కుంపట్లు ఏర్పాటయ్యాయి. 2019 ఎన్నికల్లో సాయంచేసిన నాయకులతోపాటు వెంటనిలిచిన కార్యకర్తల వరకు అసమ్మతి రగిలిపోతూ ఆమెకు వ్యతిరేకంగా పనిచేసేందుకు సిద్ధమవుతున్నారు. అసమ్మతి నాయకులు, కార్యకర్తలు శ్రీదేవికి వ్యతిరేకంగా పనిచేస్తే నియోజకవర్గంతో ఓటమితోపాటు పార్టీ బలహీనమయ్యే పరిస్థితులు ఉండటంపై పార్టీనేతలు టికెట్ ప్రకటన వాయిదా వేసినట్లు సమాచారం.

ఎన్నికల బరిలో ఉంటానంటున్న నాగరత్నమ్మ



తండ్రి రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకుని ఎన్నికల బరిలో నిలిచి తీరుతానంటున్నారు ఎస్వీ సుబ్బారెడ్డి కుమార్తె, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ. ఎన్నికల బరిలో ఉంటానంటూ తాజాగా ఆమె చేసిన ప్రకటన అధికార వైసీపీలో మరో వర్గానికి దారితీసినట్లయింది. 2012లో నాగరత్నమ్మ, భర్త రామచంద్రారెడ్డి వైసీపీలో చేరారు. ఏ పదవీ ఆశించకుండా పనిచేస్తున్న తమకు ఈసారి సీఎం జగన్ టికెట్ ఇస్తారని వారు ఆశలు పెట్టుకున్నారు. నిజానికి సొంతవర్గాన్ని బలపరుచుకునేందుకు ఎస్వీ వర్గాన్ని అణచివేసేలా ఎమ్మెల్యే శ్రీదేవి మొదటి నుంచి పావులు కదుపుతూ వచ్చారు. ఈ క్రమంలో తమ వర్గాన్ని కాపాడుకునేందుకు ఎన్నికల బరిలో ఉండాల్సిందేనన్న పట్టుతో నాగరత్నమ్మ ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే సీఎం జగన్‌ను, పార్టీ పెద్దలను పలుమార్లు కలిసివచ్చారు.

25న పత్తికొండకు చంద్రబాబు

19న సన్నాహక సమావేశం



కర్నూలు(అర్బన్), జనవరి 16: పత్తికొండలో ఈనెల 25న రా..కదలిరా.. బహిరంగ సభ కోసం టీడీపీ అధినేత చంద్రబాబు వస్తున్నారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, పత్తికొండ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు సంయుక్తంగా పిలుపు నిచ్చారు. మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో ఈనెల 19న పత్తికొండలో సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ సమావేశానికి జోన్ ఇన్‌చార్జి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర యాదవ్, ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల రాష్ట్ర ఇన్‌చార్జి వి. ప్రభాకర్ చౌదరి, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు వస్తున్నారని తెలిపారు. వివిధ స్థాయిల్లో పార్టీ కమిటీ సభ్యులు, టీడీపీ శ్రేణులు తప్పని సరిగా హాజరు కావాలని కోరారు.

మంత్రాలయంలో కిక్కిరిసిన భక్తులు




మఠం ప్రాంగణంలో రద్దీగా ఉన్న భక్తులు

మంత్రాలయం, జనవరి 16. రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం కిక్కిరిసింది. సంక్రాంతి సెలవు దినాలు కావటంతో దక్షిణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, ప్రధాన రహదారులు, మధ్వమార్గ్ కారిడార్, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారాయి. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయలు నవరత్నాల రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పరీక్షలు దగ్గర పడ్డాయి..

- ఫిబ్రవరి 5 నుంచి ఇంటర్ సైన్స్ ప్రాక్టికల్స్
- మార్చి 1 నుంచి థియరీ పరీక్షలు ప్రారంభం
- మార్చి 18 నుంచి పది పబ్లిక్ పరీక్షలు
- విద్యార్థుల్లో ఆందోళన

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 16: పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు. విద్యా సంవత్సరం పూర్తయినా ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు సరఫరా చేయలేదు. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం విద్యార్థులకు ఉచితంగా అన్నీ సమకూర్చుతున్నట్లు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తోంది. తెలుగు, ఇంగ్లీషు మీడియం పుస్తకాలు పంపిణీ చేసినా, ఉర్దూ, కన్నడ, సంస్కృతం, మైనర్ మీడియా పాఠ్య పుస్తకాల సరఫరాను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిలిపి వేసింది. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు ఇచ్చే నోట్స్‌పైన, మార్కెట్లో దొరికే మెటీరియల్‌తోనే ఆ విద్యార్థులు ప్రిపేర్ అవుతున్నారు. రాష్ట్రప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పుకోవడమే తప్ప చేస్తున్నదేమీ లేదనే విమర్శలు ఉన్నాయి.



ఇంటర్‌లో 47,412 మంది విద్యార్థులు

కర్నూలు జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 47,412 మంది ఉన్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 22,239 మంది, ద్వితీయ సంవత్సరంలో 25,173 మంది ఉన్నారు. ఫిబ్రవరి 2న మానవీయ నైతిక విలువల పరీక్ష, 3న పర్యావరణ శాస్త్ర పరీక్ష జరుగుతాయి. ఫిబ్రవరి 5న ఇంటర్ వొకేషనల్ సైన్స్ ప్రాక్టకల్స్ పరీక్షలు మొదలుకాగా, 10 వ తేది నుంచి మెయిన్ సైన్స్ గ్రూపు ప్రాక్టకల్స్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మార్చి 1 నుంచి ఇంటర్ పబ్లిక్ థియరీ పరీక్షలు జరుగనున్నాయి.

మార్చి 18 నుంచి పది పబ్లిక్ పరీక్షలు

కర్నూలు జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్, అన్-ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 30 వేల మంది హాజరవుతున్నారు. ఇప్పటికే సిలబస్ పూర్తి అయి, వీక్లీ టెస్టులు, డైలీ టెస్టులు, రివిజన్ క్లాసెస్ జరుగుతున్నాయి. మార్చి 18 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌ను ఎస్ఎస్‌సీ బోర్డు ప్రకటించింది. ప్రైవైట్ పాఠశాలల విద్యార్థుల పరిస్థితి మెరుగ్గా ఉన్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల పరిస్థితి గందరగోళంగా ఉంది. పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతుండడంతో విద్యార్థుల చదువుపట్ల వారి తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకుంటున్నారు.

షర్మిల నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం

నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మినరసింహ యాదవ్

నంద్యాల టౌన్, జనవరి 16: ఏపీసీసీ చీఫ్‌గా ఎంపికైన వైఎస్ షర్మిల నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుందని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు జె.లక్ష్మినరసింహ యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం డీసీసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తమ లక్ష్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ నిబంధనలు, నిర్ణయాలను దివంగత నేత వైఎస్సార్ ఏనాడూ అతిక్రమించలేదన్నారు. నేడు ఆయన కుమార్తె వైఎస్ షర్మిల రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా ఎంపికైందన్నారు. ఆమె సారథ్యంలో కాంగ్రెస్‌ను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడం కోసం కార్యాచరణ బద్ధంగా ముందుకు సాగుతామన్నారు. గతంలో కాంగ్రెస్ నుంచి బయటకు వెళ్లిపోయిన కాంగ్రెస్ వాదులందరూ తిరిగి పార్టీలోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆహ్వానితుడిగా గిడుగు రుద్రరాజును నియమించినందుకు, పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిలను నియమించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ముఖ్య నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, సంస్థాగత ప్రధాన కార్యదర్శి కెసీ వేణుగోపాల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ మాణిక్కం ఠాగూర్‌లకు లక్ష్మీనరసింహ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు

ఇద్దరికి కత్తిపోట్లు

కోవెలకుంట్ల, జనవరి 16: కోవెలకంట్లలోని సౌదరదిన్నె సమీపంలో నివసించే ఓ యువతి, మరో వ్యక్తి మంగళవారం కత్తిపోటుకు గురయ్యారు. అవుకు మండలం రామాపురంకు చెందిన ఓ యువతితో కోవెలకుంట్ల పట్టణానికి చెందిన ఓ యువకుడితో నాలుగేళ్ల క్రితం వివాహం నిశ్చయమైంది. పెళ్లి ఆలస్యం అవుతుండటంతో అమ్మాయిల బంధువులు కోవెలకుంట్ల పట్టణ సమీపంలోని సౌదరదిన్నె సమీపంలోని డిగ్రీ కళాశాలవద్ద కాలనీలో నివసించే యువకుడి ఇంటికి వచ్చారు. అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని అడగడంతో మాట మాటా పెరిగి ఇరువర్గాల వారు వాగ్వాదం చేసుకున్నారు. పెళ్లి కూతురు తరుపు బంధువులు పెళ్లి కొడుకు తరపు వ్యక్తులకు పొడిచారు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని కోవెలకుంట్ల వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఘర్షణపై విచారణ చేస్తున్నారు.

ఆర్టీసీ కాలనీలో చోరీ

కర్నూలు, జనవరి 16: తాలుకా పోలీసు స్టేషన్ పరిధిలో ఆర్టీసీ కాలనీలో నాలుగు ఇళ్లల్లో చోరీలు జరిగాయి. వైద్య ఆరోగ్య శాఖలో పని చేసే వీరశేఖర్ ఇంట్లో రూ.6 వేల నగదు, వెండి ఆభరణాలు చోరీ చేశారు. వీరశేఖర్ పనుల కోసం జమ్మలమడుగు వెళ్లి తిరిగి వచ్చాక ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించాడు. అలాగే నందికొట్కూరు వైద్యఆరోగ్య శాఖలో పని చేస్తున్న జగదీష్ పనుల నిమిత్తం పగిడ్యాల వెళ్లి. మంగళవారం వచ్చి చూస్తే ఇంట్లో ఉన్న రూ.2వేల నగదు, కొన్ని బంగారు ఆభరణాలు చోరికి గురైనట్లు గుర్తించాడు. అలాగే ఆథేనా స్కూల్‌లో వాచ్‌మెన్ వెంకటేశ్వర్లు రెండు ఇళ్లల్లో కూడా చోరీ జరిగింది. వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు పండుగకు ఊరికి వెళ్లగా.. ఈయన సోమవారం రాత్రి వాచ్‌మెన్ డ్యూటీకి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చి చూస్తే ఇంట్లో ఉన్న రూ.40వేల నగదుతో పాటు బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలుసుకున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ శ్రీరామ్ సంఘటనా స్థలానికి వెళ్లి దొంగతనాలపై ఆరా తీశారు. క్లూజ్ టీమ్ మూడు ఇళ్లల్లో జరిగిన దొంగతనాల గురించి వివరాలు సేకరించారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు.

అధిక శబ్దాలు చేసే వాహనాలపై స్పెషల్ డ్రైవ్

18 మందిపై కేసు నమోదు

కర్నూలు, జనవరి 16: టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆసుపత్రి ముందు ఓ బైక్ అధిక శబ్దం చేస్తూ వెళ్లడంతో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడని ఆసుపత్రి నిర్వాహకులు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం రాత్రి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. స్థానిక ఐదు రోడ్ల కూడలిలో సీఐ ఇంతియాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ డ్రైవ్‌లో ట్రిపుల్ రైడింగ్, అధిక శబ్దాలతో సైలెన్సర్లు లేకుండా వున్న వాహనదారులను నిలిపి తనిఖీ చేశారు. 18 మంది వాహనదారులు నిబంధనలు ఉల్లంఘించినట్లు తెలిసింది. వీరందరినీ స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అధిక శబ్దం చేస్తూ వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. అధిక శబ్దాలు చేసే వాహనాల వల్ల పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని సీఐ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అహోబిలంలో వ్యక్తి మృతి

ఆళ్లగడ్డ, జనవరి 16: అహోబిలంలో రుద్రవరం మండలం ముత్తలూరు గ్రామానికి చెందిన రామసుబ్బారెడ్డి(50) అనే వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. మృతుడు అహోబిలం లక్ష్మీనరసింహస్వామి మాల ధరించి, పార్వేట ఉత్సవ పల్లకి గ్రామాలకు వెళ్తున్న సమయంలో ఆ జనసందోహంలో పాల్గొనడంతో ఊపిరి ఆడక స్పృహ తప్పి కింద పడిపోయాడు. అక్కడే ఉన్న మాజీ మంత్రి అఖిలప్రియ గమనించి అతన్ని వెంటనే ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం వారి వాహనంలో తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈయన మృతి పట్ల మాజీ మంత్రి అఖిలప్రియ, ఆమె బార్గవ్‌రామ్‌నాయుడు, తమ్ముడు విఖ్యాత్‌రెడ్డి, పలువురు నాయకులు సంతాపం ప్రకటించారు.

తొంగి చూడని కంది రైతులు

- ధర చెల్లిస్తామని బతిమిలాడుకున్న మార్క్‌ఫెడ్ అధికారులు
- నెలల తరబడి డబ్బులు ఇవ్వకపోవడమే కారణమా..?

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 16: గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రకటించిన మద్దతు ధరకు మించి బైటి వ్యాపారులు చెల్లించే ధర ఇస్తామని, కందులు విక్రయించమని మార్క్‌ఫెడ్ అధికారులు కోరినా రైతులు ఆ వైపు తిరిగి చూడటం లేదు. చౌక దుకాణాల్లో కందిబేడలు సప్లయ్ చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల నుంచి ఎంత ధరనైనా చెల్లించి కొనుగోలు చేసేందుకు సిద్ధపడుతున్నాయి. అయితే.. రైతులు మాత్రం బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులకే చెల్లించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కిలో కందిబేడలు రూ.150 నుంచి రూ.200 దాకా ధర పలుకుతున్నాయి. వినియోగదారులు ఈ ధరకు కొనుక్కోలేక పచ్చడి మెతుకులతో సరిపుచ్చుకుంటున్నారు. ప్రజల నిరసన ప్రస్తుత ఎన్నికల సమయంలో తమకు ఇబ్బందిగా మారే అవకాశం ఉందని గ్రహించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాఫెడ్, మార్క్‌ఫెడ్ సంస్థల ద్వారా బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు చెల్లించే ధరకే కందులు కొనాలని నిర్ణయించాయి. వారం కిందట ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన నాఫెడ్ మేనేజర్ వినయ్‌కుమార్ కర్నూలు వచ్చి డీసీఎంఎస్ అధికారులతో సమావేశమై కందులను ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు చెల్లించే ధరకే కొనుగోలు చేస్తామని, వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి కందులు కొనండని ఆదేశించి వెళ్లారు. అయితే.. ఇప్పటి దాకా రైతులు మార్క్‌ఫెడ్, నాఫెడ్‌తో పాటు డీసీఎంఎస్ కేంద్రాలకు కందులను విక్రయించేందుకు ఏ మాత్రం మొగ్గు చూపకపోవడంతో ఆ కేంద్రాలు వెలవెలబోతున్నాయి. గతంలో ప్రభుత్వం తమ నుంచి మొక్కజొన్న, కందులు తదితర పంట ఉత్పత్తులను మద్దతు ధరకే కొనుగోలు చేసేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసిందని, అయితే.. నెలల తరబడి డబ్బులు చెల్లించలేకపోవడంతో తాము అప్పులు తీర్చుకునే అవకాశం ఇబ్బందులు ఎదుర్కొన్నామని రైతులు తెలుపుతున్నారు. మరోసారి ఈ పొరపాట్లు చేయబోమని, వ్యాపారులైతే.. వారం రోజుల్లోనే డబ్బులు చెల్లిస్తారని అంటున్నారు.


మార్కెట్ యార్డుకు రైతులు విక్రయానికి తెచ్చిన కందులు

టీడీపీ ద్వారానే ముస్లింల అభివృద్ధి

శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్

కర్నూలు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ముస్లింల అభివృద్ధి, సంక్షేమం టీడీపీ ద్వారానే సాధ్యమని.. రాబోయే ఎన్నికల్లో సైకిల్‌కు ఓట్లేసి టీడీపీని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ పేర్కొన్నారు. నగరంలోని మౌర్యఇన్ పరిణయ హాలులో కర్నూలు నియోజకవర్గం ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం జరిగింది. నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి టీజీ భరత్, టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ముస్తాక్ మౌలానా, జనసేన కర్నూలు ఇన్‌చార్జి అర్షద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ గత చంద్రబాబు ప్రభుత్వం ముస్లీంల అభ్యున్నతి కోసం ఎన్నో పథకాలు విడుదల చేసిందని, రంజాన్ పర్వదినాన ప్రతి ముస్లిం ఇంట ఆనందంగా జరుపుకోవాలని రంజాన్ తోఫా అమలు చేస్తే జగన్ వచ్చి రద్దు చేశారన్నారు. ఇలాంటి ఎన్నో పథకాలు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. కర్నూలు నగరంలో సేవలకు కేరాఫ్ అడ్రస్‌గా టీజీ కుటుంబం ఉందన్నారు. మైనార్టీకి చెందిన వ్యక్తి అని గత ఎన్నికల్లో హఫీజ్‌ఖాన్‌ను ఎమ్మెల్యేగా ప్రజలు ఎన్నుకుంటే వక్ఫ్‌బోర్డు భూములు అన్యాక్రాంతమైనా కాపాడలేకపోయారనీ ఆరోపించారు. లక్షకు పైగా ఉన్న ముస్లింలకు న్యాయం జరగాలా..? హఫీజ్‌ఖాన్ ఒక్కడికే న్యాయం జరగాలా..? అన్న విషయాన్ని ప్రతి ఒక్క ముస్లిం సోదరుడు ఆలోచించాలని గుర్తు చేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి టీజీ భరత్ మాట్లాడుతూ రాజధాని బిల్లును శాసనమండలిలో అడ్డుకుని రాష్ట్రం మూడుముక్కలు కాకుండా కాపాడిన ఏకైక వ్యక్తి మండలి మాజీ చైర్మన్ షరీఫ్ అని అన్నారు. ఓట్ల కోసం కర్నూలు నాయకులు ఎన్నో నాటకాలకు తెరతీస్తారన్నారు. మైనార్టీలకు ఎంతో ఉపయోగపడే ఉర్దూ యూనివర్సిటీ నిర్మాణం పూర్తవ్వడానికి కృషి చేయలేని ఈ జేఏసీలు ఎందుకని ప్రశ్నించారు. నంద్యాలలో వైసీపీ నేతల ఒత్తిళ్లు తట్టుకోలేక ముస్లీం మైనార్టీ కుటుంబం ఆత్మహత్య చేసుకుంటే ఆ రోజు జేఏసీ ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ కమిటి నగర అధ్యక్షుడు హమీద్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వాహీద్, రాష్ట్ర మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మన్సూర్ అలీఖాన్, రాష్ట్ర కార్యదర్శి బషీర్, కర్నూలు జిల్లా టీడీపీ మహిళా అధ్యక్షురాలు ముంతాజ్, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.


ఐక్యతను చాటుతున్న శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్, టీజీ భరత్, ముస్లిం నాయకులు

సీమ సమస్యలపై నాయకులను నిలదీయండి

నీటి అవగాహనే రాయలసీమకు రక్ష పుస్తకావిష్కరణ సభలో వక్తలు

ఎమ్మిగనూరు, జనవరి 16: రాయలసీమకు తరతరాలుగా అన్యాయం జరుగుతోందని, రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గ నీటి సమస్య, కరువు, వలసలపై ఓట్ల కోసం వచ్చే నాయకులను నిలదీయాలని రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకులు పిలుపునిచ్చారు. .పట్టణంలోని ఆర్ఎంకే కోచింగ్ సెంటర్‌లో సోమవారం రాయలసీమ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో విద్యావంతుల వేదిక నాయకుడు నాగన్న అధ్యక్షతన సభ జరిగింది. ఇందులో బొజ్జా దశరథరామిరెడ్డి రచించిన నీటిపై అవగాహనే రాయలసీమకు రక్ష అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యావంతుల వేదిక నాయకుడు కె. రత్నం ఏసేపు మాట్లాడుతూ రాయలసీమలో నానాటికీ కరువు, వలసలు ఎక్కువవుతున్నాయోకాని తగ్గటం లేదన్నారు. రాయలసీమ నుంచి అధికారంలోకి వస్తున్న పాలకులే రాయలసీమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంను పాలకులు మరింత నిర్లక్ష్యానికి గురిచేస్తున్నారన్నారు. పాణి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో వేదవతి ప్రాజెక్టు, ఆర్డీఎస్ కుడికాలువ, గుండ్రేవుల రిజర్వాయర్ల నిర్మాణం ఇప్పటికీ ప్రారంభం కాలేదన్నారు. అధికారంలోకి వచ్చిన ఏ పార్టీ కూడా ఈ ప్రాంత సమస్యలను పట్టించుకోవటం లేదన్నారు. ఈ ఎన్నికల కాలమంతా పశ్చిమ ప్రాంత రైతులు, యువకులు సీమ సమస్యల పట్ల రాజకీయ నాయకులను నిలదీసే ఉద్యమాన్ని చేపట్టాలని అన్నారు. ఈ సదస్సులో డీటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్, కరె కృష్ణ, మోహన్, ప్రజా సంఘాల నాయకులు ఏసేపు, రాజేష్, గణేష్, నరసన్న, న్యాయవాది తిమ్మప్ప, నరసప్ప పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఈ బామ్మకు 105 ఏళ్లు..!

- ఘనంగా జన్మదిన వేడుకలు
- 60 మందికిపైగా తరలివచ్చిన కుటుంబ సభ్యులు



ఉయ్యాలవాడ, జనవరి 16: చూడముచ్చటగా ఉన్న ఈ గ్రూప్ ఫొటో ఏదో పూర్వ విద్యార్థుల సమ్మేళనం అనుకుంటే పొరపడినట్టే. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. పోనీ సంక్రాంతి పండుగకు కలిశారా? అంటే అదీ లేదు. ఈ కుటుంబం మొత్తానికి పెద్దదిక్కుగా ఉన్న 105 ఏళ్ల బామ్మ జన్మదిన వేడుకలకు వీరంతా హాజరయ్యారు. ఉయ్యాలవాడ మండలంలోని హరివరం గ్రామానికి చెందిన పుల్లమ్మ మంగళవారానికి 104 ఏళ్లు పూర్తి చేసుకుని 105వ ఏట అడుగుపెట్టింది. ఈ సందర్భంగా ఆయన కుమారుడు పల్లె వెంకటశివారెడ్డి తల్లి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని భావించాడు. దీంతో మనుమడు పల్లె మహేశ్వర్ రెడ్డితో కలిసి 105వ జన్మదిన వేడుకలను హరివరం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఇదిలా ఉండగా పుల్లమ్మకు ఇద్దరు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వీరికి 14 మంది సంతానం కాగా మనవళ్లు, మనవరాళ్లు 28 మంది ఉన్నారు. వీరికి మరో 11 మంది ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మొత్తం 60 మంది కుటుంబ సభ్యులు కలిసి కేక్‌కట్ చేసి వృద్ధురాలికి తినిపించారు. అప్పట్లో తిన్న జొన్న సంగటి, అంబలి, జొన్నరొట్టె, రాగులు, కొర్ర అన్నం లాంటి బలమైన ఆహారం తీసుకోడం వల్లే ఇన్ని రోజులు ఆరోగ్యంగా ఉన్నానంటూ బామ్మ పుల్లమ్మ బర్త్‌డే రోజున హ్యాపీగా చెప్పడం విశేషం.


కుటుంబ సభ్యులతో వృద్ధురాలు పుల్లమ్మ

కోడి పందేలపై పోలీసుల దాడులు

- 15మంది నిర్వాహకుల అరెస్టు
- 26 కేసులు నమోదు
- జిల్లా వ్యాప్తంగా 51 బైండోవర్ కేసులు

నంద్యాల క్రైం, జనవరి 16: నంద్యాల జిల్లాలో సోమ, మంగళవారాల్లో పోలీసులు, సెబ్ పోలీసులు జరిపిన విస్తృతదాడుల్లో 26 కేసులు నమోదు చేసి 14మందిని అరెస్టు చేశారు. ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో రెండ్రోజులుగా ముమ్మరంగా దాడులు, తనిఖీ చేపట్టారు. నాటుసారా బట్టీలపై దాడులు చేసి 26 కేసులు నమోదు చేసి 14మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 182 లీటర్ల సారా సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అలాగే 10 డీపీఎల్ కేసుల్లో 325 డీపీఎల్ మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. జూపాడుబంగ్లా పోలీసు స్టేషన్ పరిధిలో కోడిపందేలు నిర్వహిస్తున్న వారిపై దాడి చేసి 15మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 10 కోళ్లను, 40మోటార్‌సైకిళ్లతోపాటు రూ.19వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే ఎన్ఫోర్స్‌మెంట్ వర్క్‌లో పోలీసు అధికారులు, సిబ్బంది డ్రంకెన్ డ్రైవ్ చేపట్టి మొత్తం 13 కేసులు, 14 ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేశారు. జిల్లా వ్యాప్తంగా 51మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసి సంబంధిత అధికారులవద్ద హాజరు పరచినట్లు పోలీసులు తెలిపారు. డోన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఒక మట్కా కేసు నమోదు చేసి రూ.3900 నగదు స్వాధీనం చేసుకున్నారు. నంద్యాల తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న వారిపై దాడి చేసి 12మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.1,28,600 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.


వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

రైల్లో నుంచి దూకి గుర్తు తెలియని వ్యక్తి మృతి

నంద్యాల క్రైం, జనవరి 16: నంద్యాల-పాణ్యం రైల్వే స్టేషన్ల మధ్య శాంతిరాం కాలేజీ వద్ద మంగళవారం ఉదయం రైలులో నుంచి కిందడి ఓ గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మరణించినట్లు రైల్వే ఎస్ఐ జలీల్ తెలిపారు. ఈ గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తూ రైలు నుంచి కింద పడ్డాడా? లేక రైలు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడా? అనేది దర్యాప్తులో తేలాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసుకున్నామని ఎస్ఐ జలీల్ తెలిపారు.


గుర్తు తెలియని మృతదేహం

వలస కూలీ ఆత్మహత్య

మంత్రాలయం, జనవరి 16. మంత్రాలయం మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన దాసరి అనంతస్వామి కొడుకు దాసరి రమేష్(37) గుంటూరు జిల్లా పత్తిపాడు గ్రామానికి వలస వెళ్లి అక్కడే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామంలో తీవ్ర కరువు వల్ల పనులు లేకపోవడంతో భార్య మహాలక్ష్మి, ముగ్గురు కొడుకులతో మిరప పంట కోసేందుకు మూడురోజుల క్రితమే వలస వెళ్లాడు. సోమవారం తెల్లవారు జామున మిరపపొలంలో వేసుకున్న కొట్టం నుంచి వెళ్లి చెట్టుకు పంచెతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య, కొడుకులు, తోటి వలస కూలీలు మృతదేహన్ని సోమవారం రాత్రి మాధవరానికి తీసుకొచ్చారు. సంక్రాంతి పండుగ పూట ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యుదాఘాతంతో రైతు మృతి

సి.బెళగల్, జనవరి 16: మండలంలోని సంగాల గ్రామానికి చెందిన నరసింహుడు 39 అనే రైతు తనకు ఉన్న 2 ఎకరాల పొలంలో ఉల్లి, మిరప పంటలను సాగుచేశాడు. బావిలో నీళ్లు లేకపోవడంతో మంగళవారం నదిలో అక్కడక్కడ ఉన్న గుంతలలోని నీటిని పారించి పంటలను బతికించుకోవాలని మోటార్‌ను, సర్వీస్ వైరును నదిలో నీటి గుంతల దగ్గరకు తీసికెళ్లి కరెంటు అమర్చే ప్రయత్నం చేశాడు. అయితే మోటార్‌కు కరెంటు సప్లయ్ కాలేదు. నీటిలో పడి ఉన్న సర్వీస్ వైరును చేత పట్టుకుని పరిశీలిస్తుండగా.. అందులో విద్యుత్ ఉంటడంతో షాక్ తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. చుట్టు పక్కల పొలాల రైతులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. మృతునికి భార్య వెంకటేశ్వరమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. ఎస్ఐ మన్మథ విజయ్ మృతదేహాన్ని పోస్టుమర్టం నిమిత్తం కోడుమూరుకు తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

అంగన్‌వాడీల నిరసన


చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

గూడూరు జనవరి 16: గూడూరులో అంగన్‌వాడీ కార్మికులు చెవిలో పువ్వులు పెట్టుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి గూడూరులో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 36వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమానికి సీఐటీయూ డివిజన్ కార్యదర్శి మోహన్ హాజరై మాట్లాడుతూ 36 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు.

30వ రోజుకు చేరిన సమ్మె

కర్నూలు(న్యూసిటీ), జనవరి 16: క్లాప్ ఆటో డ్రైవర్లు పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరుతూ చేపట్టిన సమ్మె సోమవారం 30వ రోజుకి చేరింది. కార్పొరేషన్ ఎదుట జరుగుతున్న సమ్మెనుద్దేశించి క్లాప్ ఆటో డ్రైవర్ల నాయకుడు షఫీ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వైసీపీ ప్రభుత్వం, అధికారులు, రెడ్డి ఏజెన్సీ కార్మికుల కడుపులు కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. కార్యక్రమంలో అబ్దుల్‌దేశాయ్, నరసింహులు, కుమార్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

22న కోడుమూరుకు హంపి పీఠాధిపతి రాక

కోడుమూరు(రూరల్), జనవరి 16: పట్టణంలోని హరిహర క్షేత్రంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నందీశ్వర ద్వారం ప్రారంభ వేడుకకు హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామిజీని ఆహ్వానించినట్లు ఆలయ చైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం ఆలయ కమిటీ సభ్యులు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎద్దుల మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఈనెల 22న అయోధ్య రామాలయ ప్రారంభ సుముహూర్తంలో హరిహర క్షేత్రంలో ఉత్తర భాగాన నందీశ్వరద్వారం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

సి.బెళగల్, జనవరి 16: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నేషపోగు కిరణ్మయి అన్నారు. మండల కేంద్రమైన సి.బెళగల్, బ్రాహ్మణదొడ్డి గ్రామాల్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కబడ్డీ, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకురాలు కిరణ్మయి హాజరై ప్రసంగించారు. కబడ్డీ పోటీల విజేతలకు మొదటి బహుమతి రూ.15,016, రెండో బహుమతి రూ.10,016, మూడో బహుమతి రూ.5016 అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివ, దానమన్న, తిరుమలేసు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం


మాట్లాడుతున్న ఆంధ్రయ్య

కోడుమూరు(రూరల్), జనవరి 16: ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడాలని మహజన సోషలిస్టు పార్టీ సీనియర్ నాయకుడు ఆంధ్రయ్య పిలుపునిచ్చారు. మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో మంగళవారం ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆంధ్రయ్య మాట్లాడుతూ ఇటీవల విశ్వరూప మహాసభలో ప్రధాని మోదీ వర్గీకరణకు హామీ ఇచ్చారన్నారు. అనంతరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రదీప్, నాగేష్, ప్రతాప్, రాజు, మణిబాబు, జక్కయ్య పాల్గొన్నారు.

నిందితుడిని ఉరితీయాలి


ధర్నా చేస్తున్న సమాఖ్య మహిళలు

కర్నూలు(న్యూసిటీ), జనవరి 16: బాలికను అత్యాచారం చేసిన నిందితుడిని ఉరితీయాలని ఏపీ మహిళా సమాఖ్య, అఖిల భారత యువజన సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం విజయ అధ్యక్షతన జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్రావణి రెడ్డి మాట్లాడుతూ పత్తికొండ డివిజన్‌లో ఓ బాలికను అదే గ్రామానికి చెందిన వ్యక్తి అత్యాచారం చేసి నాలుగురోజులవుతున్నా ఇప్పటి వరకు అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. అనంతరం ఏఎస్పీ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి ఎం.బీసన్న, నాయకులు అమినాబీ, ఆశాబేగం, సోఫియా, కోటమ్మ, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

వైభవంగా మీరాసావలి కిస్తీలు


దర్గాకు తరలివచ్చిన భక్తులు

ఓర్వకల్లు, జనవరి 16: మండలంలోని హుశేనాపురంలో మీరాషావలి నాసర్ షరీఫ్ ఉరుసు సందర్భంగా మంగళవారం కిస్తీలు వైభవంగా జరిగాయి. మహిళలు, భక్తులు హాజరై స్వామివారికి కాయకర్పూరాలు సమర్పించారు. మాబూసుభాని దర్గా నుంచి మీరాషావలి దర్గా వరకు గంధారింర తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. కార్యక్రమంలో నిర్వాహకులు షరీఫ్, సాధిక్, అక్బర్‌బాషా, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా వలసలు

» టీజీ భరత్ సమక్షంలో బంగారు పేట వాసులు, కొత్త పేట నాయీ బ్రాహ్మణుల చేరిక


టీడీపీలో చేరిన బంగారు పేట వాసులతో టీజీ భరత్

కర్నూలు(అర్బన్), జనవరి 16: తెలుగుదేశం పార్టీలోకి భారీగా వలసలు మొదలయ్యాయి. నగరంలోని 13 వార్డు బంగారుపేటకు చెందిన ప్రజలు తెలుగుదేశం పార్టీలో చేరారు. మంగళవారం సాయంత్రం టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ సమక్షంలో పార్టీ నాయకులు సురేష్, శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో హుసేన్ ఖాన్, షేర్ ఖాన్, మహబూబ్ ఖాన్, రియాజ్ ఖాన్ కుటుంబాలు టీడీపీలో చేరాయి. టీజీ భరత్ వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

● తెలుగుదేశం ప్రభుత్వంతోనే నాయీబ్రాహ్మణులకు మేలు జరుగుతుందని పార్టీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. మంగళవారం నగరంలోని మౌర్యఇన్ హోటల్‌లో టీజీ భరత్ సమక్షంలో 51వ వార్డు కొత్తపేటకు చెందిన నాయీబ్రాహ్మణులు చెన్నప్ప, రంగారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలో అన్ని కులాల వారికి మేలు జరుగుతుందన్నారు. నాయీబ్రాహ్మణులు పడుతున్న ఇబ్బందులను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించుకునేందుకు కృషి చేస్తా నని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, నవీన్‌కుమార్, అజయ్, గోవిందు, తులసి, మల్లికార్జునబాబు, వెంకటేష్, వెంకటేశ్వర్లు, శ్రీను, కృష్ణబాబు, నారాయణ పాల్గొన్నారు.

ముగిసిన సంక్రాంతి వేడుకలు

జిల్లాలో సంక్రాంతి వేడుకలు మంగళవారంతో ముగిశాయి. గ్రామాల్లో వివిధ పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

కర్నూలు(న్యూసిటీ), జనవరి 16: నగరంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. నగరంలోని ఇందిరాగాంధీ నగర్‌లో డీవైఎఫ్ఐ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, పీఎన్ ఎం, కేవీపీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ.గఫూర్ హాజరై ప్రసంగించారు. సంక్రాంతి పండుగ వాతా వరణం కలకాలం గుర్తుగా ఉం డాలన్నారు. ప్రజలపైన కరెంటు, ఆర్టీసీ చార్జీల భారం రకరకాల పన్నులు పెరిగి ఆదాయాలు లేక సంతోషంగా పండుగలు కూడా జరుపుకునే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కుమారి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కే.అరుణ, మాజీ కార్పొరేటర్ రాముడు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని ఓర్వకల్లు, కన్నమడకల, పూడిచెర్ల, నన్నూరు, ఉయ్యాలవాడ, హుశేనాపురం, సోమయాజులపల్లె తదితర గ్రామాల్లో సోమవారం సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే మహిళలు ఇంటి ముందు ముగ్గులు వేశారు. పిల్లలకు నుదుటున బొట్టు పెట్టి, తలపై రేగిపండ్లు పోసి స్నానాలు చేయించి ఆశీర్వదించారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అలాగే కేతవరంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు దాతలు బహుమతులు అందజేశారు.

కోడుమూరు(రూరల్): మండలంలోని గ్రామాల్లో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు వేకువజామునే ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులను తీర్చిదిద్దారు. పిండివంటలతో ఇంటిల్లిపాది కలిసి భోజనం చేశారు. రైతులు పశువులకు పూజలు నిర్వహించారు. కాగ అనుగొండలో ముగ్గుల పోటీ నిర్వహించి బహుమతులు అందజేశారు.

గూడూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. వేకువ జామునే మహిళలు ఇళ్ల ముందు కల్లాపి చల్లి రంగు రంగుల ముగ్గులు వేసి గోమాతకు పూజలు చేశారు. ఈసందర్భంగా ముగ్గుల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు.

● గూడూరులో ఎం.జీ.బీ యూత్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. టీడీపీ నాయకులు రాజా రెడ్డి, చరణ్ కుమార్, చెట్టుకింది సురేష్, మధులు హాజరై ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎం.జీ.బీ యూత్ సభ్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



కర్నూలులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఏ.గఫూర్


ఉల్లిందకొండలో..


గూడూరులో..

కల్లూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా కల్లూరు మండలం కే.మార్కాపురం గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు డి.రామాంజనేయులు ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు పాణ్యం మాజీ ఎమ్మెల్యే, పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరుచరితారెడ్డి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కల్లూరు మండలం ఉలిందకొండలో సంక్రాంతిని పురస్కరించుకొని టీడీపీ సీనియర్ నాయకుడు ఈవీ రమణ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన జి.సాయిలీల, బి.మహారాణి, బి.వనజ, ఎం.మంజులకు ఈవీ రమణ బహుమతులు అందజేశారు. అలాగే ఆటో వర్కర్స్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఈ.నాగప్ప, ఈ.శ్రీనివాసులు, ఈ.శ్రీకాంత్, మురళి, కలాం పాల్గొన్నారు.

ఘనంగా రామిరెడ్డి తాత ఆరాధనోత్సవాలు


పూజల్లో పాల్గొన్న గౌరు దంపతులు

కల్లూరు, జనవరి 16: రామిరెడ్డి తాత 31వ ఆరాధనోత్సవాలు మంగళవారం సంస్థాన్ అధ్యక్షుడు దాసరి రామచంద్రారెడ్డి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం మేలుకొలుపు, సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, రామిరెడ్డితాత సంకీర్తన, మహా మంగళహారతి విశిష్ట పూజలు జరిగాయి. అలాగే హిందూ ధార్మిక, ఆధ్యాత్మిక సంస్థల పీఠాధిపతుల ఆధ్వర్యంలో అవధూత రామిరెడ్డి తాత కాంస్య విగ్రహ శోభయాత్ర నిర్వహించారు. అనంతరం రామిరెడ్డి తాత సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

● గౌరు దంపతుల ప్రత్యేక పూజలు: రామిరెడ్డి తాత ఆరాధనోత్సవాల్లో పాణ్యం, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చారుల్లు గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గౌరు దంపతులను సాదారంగా ఆహ్వానించి శాలువలతో సన్మానించారు. ప్రజలు భక్తి శ్రద్ధలతో వేడుకలు నిర్వహించుకోవాలని వారు సూచించారు.

మా బాధలు ఈ ప్రభుత్వానికి పట్టవు

సహకార ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక చైర్మన్ రామకృష్ణ

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 16: రాజకీయ నాయకుల నుంచి ఒత్తిళ్లను తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్న తమపై ప్రభుత్వం కనికరం చూపడం లేదని కర్నూలు జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం నగరంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని సహకార సంఘాల్లో ఇప్పటిదాకా రైతులు మాత్రమే వాటాదారులుగా ఉన్నారని, అయితే.. ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవోలో 50 శాతం వాటాలను ప్రైవేటు వ్యక్తులకు కంపెనీలకు ధారాదత్తం చేస్తూ జీవోను విడుదల చేసిందని, దీని వల్ల రైతులకు ఎంతగానో ఉపయోగపడుతున్న సంఘాలు, వాటిల్లో పని చేస్తున్న ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోబోతున్నారని అన్నారు. జీవో.నెం.36, 90 ప్రకారం వేతనాలను అమలు చేయాలని, 2016 ఏప్రిల్ 1వ తేదీ నుంచి పెండింగ్‌లో ఉన్న మోనాకరి బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని, రిటైర్మెంటు బెనిఫిట్స్, గ్రాట్యూటీ చట్టం ప్రకారం అమలుపరచాలని డిమాండ్ చేశారు. హెచ్ఆర్ పాలసీని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు గతంలో ప్రభుత్వం, బ్యాంకులు సంఘాలు కలిపి క్యాడర్ ఫండ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు.

పందికోనలో టీడీపీ ఫ్లెక్సీ ధ్వంసం

పత్తికొండ, జనవరి 16: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు ఫోటోలతో గ్రామనాయకులు ఏర్పాటుచేసుకున్న టీడీపీ ఫ్లెక్సీని గుర్తుతెలియని దుండగులు బ్లేడ్లతో కోసి పెట్రోల్‌పోసి నిప్పంటించారు. పత్తికొండ మండల పరిధిలోని పందికోన గ్రామంలో సోమవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. టీడీపీ మండల అధ్యక్షుడు కడవలసుధాకర్ తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 25న పత్తికొండలో రా కదలిరా చంద్రబాబు పర్యటనకు మద్దతుగా గ్రామంలో బస్టాండ్ సమీపంలో ఓ ఇంటికి బారీఫ్లెక్సీని ఏర్పాటు చేశాము. గుర్తుతెలియని దుండగులు బ్లేడ్లతో చించి పెట్రోల్‌పోసి తగలబెట్టారు. పోలీస్‌స్టేషన్‌లో సంఘటనపై ఫిర్యాదు చేశామని కడవల సుధాకర్ వివరించారు.

పంచాయతీ అభివృద్ధిపై శిక్షణ

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 16 : జిల్లాలో గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై బుధ, గురువారం రోజులలో శిక్షణ కార్యక్రమం జరుగుతుందని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు ఒక ప్రకటనలో తెలపారు. ఎంపీడీఓ, ఈఓఆర్డీ, పంచాయతీ సెక్రెటరీ, సర్పంచ్‌లు, వార్డు సచివాలయ అధికారులు, ఎంపీటీసీలు తప్పనిసరిగా శిక్షణ కార్యక్రమానికి హాజరుకావాలని తెలియజేశారు. అదేవిధంగా తిరుపతిలోని పద్మావతి మహిళా యూని వర్సిటీలో 3 రోజులపాటు 'ఆరోగ్యవంతమైన గ్రామపంచాయతీ' అనే అంశంపై నేషనల్ కాన్ఫరెన్స్ జరుగుతుందని తెలిపారు.

రాజకీయ పార్టీలు ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 16: రాయలసీమ ప్రాంత ప్రాజెక్టులపై అన్ని రాజకీయ పార్టీలు దృష్టి పెట్టాలని బీజేపీ సీనియర్ నాయకుడు కె.కపిలేశ్వ రయ్య అన్నారు. మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో పార్టీ మాజీ అసెంబ్లీ కన్వీనర్ రంగస్వామి, జిల్లా నాయకులు కాళింగి నరసింహవర్మ, కాశీవిశ్వనాథ్, సందడి సుధాకర్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాల విభజన తర్వాత సాగునీటి పథకాలన్నీ నంద్యా లలో ఉన్నాయన్నారు. కర్నూలు జిల్లాలో తాగునీరు కూడా దొరకని స్థితి నెలకొందన్నారు. కర్నూలు జిల్లాలో సుంకేసుల తప్ప మరో చెప్పుకోదగ్గ ప్రాజెక్టులేవన్నారు. గుండ్రేవుల నిర్మిస్తామని అన్ని పార్టీలు ఎన్నికల సమయంలో కంటి తుడుపు చర్యగా హామీ ఇస్తారేగాని కార్యాచరణ వైపు ముంద డుగు వేయడం లేదన్నారు. అన్ని పార్టీలు రాయలసీమ ప్రాజెక్టుల మీద దృష్టి పెట్టాలని బీజేపీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి మొదటి వారంలో గుండ్రేవుల నుంచి 5 రోజుల పాటు కర్నూలు కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టనున్నామని, తగిన కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ ఎస్సీ మో ర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, మహిళా మోర్చా అధ్యక్షురాలు మాలతి, కోడుమూరు, ఆలూరు, పత్తికొండ అసెంబ్లీ కన్వీనర్లు ప్రేమ్ కుమార్, వెంకట్రాముడు, రంజిత్ కర్ని పాల్గొన్నారు.

'రాయలసీమ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది'

కర్నూలు(కల్చరల్) జనవరి 16: రాయలసీమ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని, మంగళవారం శ్రీసత్యసాయి జిల్లాకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ ఈ ప్రాంతంపై ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రకటించే అవకాశం ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగురూరు రాఘవేంద్ర అన్నారు. నగరంలోని 46వ వార్డు నరసింహారెడ్డినగర్‌లోని బీజేపీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అయో ధ్యలో రామమందిరం నిర్మాణంతో రామరాజ్యం సాధ్యమన్నారు. అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ ఆహ్వానాన్ని తిరస్కరించిన కాంగ్రెస్ ఇతర పార్టీలు చారిత్రక తప్పిదం చేశాయని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కోశాధికారి లోకేశ్వరయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసు నమోదు

కర్నూలు, జనవరి 16: ఉలిందకొండ గ్రామానికి చెందిన నడిపి నాగన్న అతని కొడుకులు సంజీవ, అశోక్, మరో వ్యక్తి నవీన్‌లపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నల్లప్ప తెలిపారు. గ్రామానికి చెందిన నడిపి నాగన్నకు అదే గ్రామానికి చెందిన బోయ రాజు అనే వ్యక్తికి గత కొద్ది కాలంగా మనస్పర్థలున్నాయి. నడిపి నాగన్న ఆరెకరాల ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్నాడు. ఈ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మేందుకు రాజు ప్రయత్నిస్తున్నాడని నడిపి నాగన్నకు అనుమానం మొదలైంది. అంతేగాకుండా తన ఇంటి పక్కనున్న స్థలాన్ని కొనుగోలు చేసే విషయంలో కూడా రాజుతో విభేదాలున్నాయి. ఇలా ప్రతి విషయంలో విభేదాలు రావడంతో నాగన్న రాజుపై కక్ష పెంచుకుని అతని చంపాలని పథకం పన్నాడు. సోమవారం రాత్రి చెన్నకేశవస్వామి గుడి వద్ద రాజుతో గొడవ పెట్టుకుని పిడిబాకు, రాడ్లతో తీవ్రంగా కొట్టారు. అంతలో స్థానికులు అప్రమత్తమై కాపాడి ఆసుపత్రికి తరలించారు. రాజు ఫిర్యాదు మేరకు నడిపి నాగన్న అతని కొడుకులపై కేసు నమోదు చేసినట్లు ఉలిందకొండ ఎస్ఐ తెలిపారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు, జనవరి 16: మండలంలోని హుశేనాపురం గ్రామంలో మీరా షావలి నాసర్ షరీఫ్ ఉరుసు సందర్భంగా దాతల సహకారంతో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ పోటీలకు 26 జట్లు పాల్గొన్నాయి. వీటిని తిలకించేందుకు యువత భారీగా తరలివచ్చారు. విజేతలకు మొదటి నుంచి వరుసగా ఐదు బహుమతులు రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు నగదును దాతలు శ్రీనివాసులు, చంద్రశేఖర్, షేక్షావలి, రవి, భాస్కర్ అందజేశారు. ఈ పోటీలకు ఆర్గనైజరుగా రామదాసు వ్యవహరించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మహబూబ్‌బాషా, నిర్వాహకులు షరీఫ్, సాదిక్, గ్రామస్థులు వడ్డె వెంకటసుబ్బయ్య, జయకృష్ణ, సుధాకర్, వేణు, రామగోవిందు, నారాయణ, గోవిందరెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో రాష్ట్రాభివృద్ధి శూన్యం

సి.బెళగల్, జనవరి 16: వైసీపీ హయాంలో రాష్ట్రాభివృద్ధి శూన్యమని టీడీపీ నాయకులు డాక్టర్ తిమ్మప్ప, బొగ్గుల దస్తగిరి అన్నారు. సోమవారం, మంగళవారం మండలంలోని బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, బ్యాథోళి, క్రిష్ణదొడ్డి, గుండ్రేవుల, ముడుమాల, ఈర్లదిన్నె, శింగవరం, కొండాపురం, పల్దొదొడ్డి గ్రామాలలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ ధనంజయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా గ్రామా లలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోలకల్లు సర్పచ్ మాదమ్మ, గుండ్రేవుల ఎంపీటీసీ సౌదాబి బాషా, జూలకల్లు సత్యరెడ్డి, శంకర్‌బాబురెడ్డి, ముడుమాల మాజీ సర్పంచ్ మద్దిలేటి పాల్గొన్నారు.

కర్నూలు(రూరల్): టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పార్టీ కోడుమూరు యువ నాయకుడు ఉల్చాల ఎంపీటీసీ శివన్న అన్నారు. మంగళవారం కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెన్నయ్య, మద్దిలేటి, బుర్ర వెంకటేశ్, పెద్ద భీసన్న, తిమ్మప్ప, తిరుపాలు, రాంబాబు, సురేష్ పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలి



మాట్లాడుతున్న కే.జగన్నాథం

కర్నూలు(న్యూసిటీ), జనవరి 16: రాష్ట్రంలో వ్యవసాయ బోర్లకు మీటర్లు బిగించే కార్యక్రమాన్ని విరమించుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం డిమాండ్ చేశారు. మంగళవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2022 సంవత్సరం విద్యుత్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం చట్టరూపం చేసిందని, ఈ చట్టాన్ని రైతులు ప్రతిపాదించలేదని అన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం రైతుల మెడపై విద్యుత్ భారాన్ని మోపాలనే ఉద్దేశంతో ఈ విద్యుత్ సవరణ బిల్లును తీసుకువచ్చిందని ఆరోపించారు. ఈ చట్టాన్ని కేంద్రంలో ఉండే బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే ప్రభుత్వాలు అనుకూలించాయని, పక్కనే ఉన్నటువంటి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గతంలో వ్యతిరేకించిందన్నారు. ఏపీ సీఎం జగన్ రైతులు ఉపయోగించే వ్యవసాయ పంప్‌సెట్లకు మీటర్లు బిగిస్తామని కేంద్ర ప్రభుత్వానికి ఎలా హామీ ఇస్తారని ఆయన ప్రశ్నించారు. సీఎం ఏకపక్షంగా రైతులతో సంప్రదించకుండ నిర్ణయం తీసుకోవడం దారుణ మన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ ఈ నెల 18న జిల్లాలోని అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్ల ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే నిర సన కార్య క్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమా వేశంలో జిల్లా అధ్యక్షుడు నాగేంద్రయ్య, కార్యదర్శి పంపన్నగౌడు పాల్గొన్నారు.

కోడుమూరుకే గర్వకారణం: సీఐ

కోడుమూరు(రూరల్), జనవరి 16: చేనేతలో కోడుమూరుకు జాతీయస్థాయి కాంస్య పతకం రావడం గర్వకారణమని సీఐ మన్సూరుద్దీన్ అన్నారు. కోడుమూరు అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం చేనేత సంఘం సొసైటీ తరఫున రాజును శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చేనేతలు కృషి, పట్టుదలకు నిదర్శనమన్నారు. ఫెన్సింగ్‌లో జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించిన హర్షితరెడ్డి, నేత్రదానం చేసిన విద్యావతి కుటుంబాలను కేడీసీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో కేడీసీ అధ్యక్షుడు డాక్టర్ షాకీర్, ప్రధాన కార్యదర్శి జయన్న, క్రిష్ణయ్య, వెంకటరామిరెడ్డి, హుసేనప్ప పాల్గొన్నారు.

బిందె సేవ రద్దు కోసం గ్రామస్థుల ఆందోళన


నిరసన తెలుపుతున్న కాల్వ గ్రామస్థులు

ఓర్వకల్లు, జనవరి 16: మండలంలోని కాల్వ గ్రామంలో బిందె సేవ రద్దు చేయడంతో మంగళవారం కాల్వబుగ్గ ఆలయం ఎదుట గ్రామస్థులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ప్రతి రోజు భజంత్రీలతో బిందె సేవ, మంగళవాయిద్యాలతో జరిగేవని భజంత్రీలు సరిగ్గా విధులకు హాజరు కాకపోవడంతో గత ఏడాదిగా ఈ కార్యక్రమం జరగలేదన్నారు. భజంత్రీలకు 86 ఎకరాల మాన్యాన్ని కేటాయించారన్నారు. భజంత్రీలు ఉత్సవాలకు సహకరించకపోవడంతోనే నిలిచిపోయాయని అన్నారు. ఈ విష యాన్ని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇప్పటికైనా ఆలయ ఈవో డీఆర్‌కేవీ ప్రసాద్ స్పందించి బిందె సేవా కార్యక్రమాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కోడి పందేలకు తరలిన నాయకులు

ఓర్వకల్లు, జనవరి 16: సంక్రాంతి పండుగ సందర్భంగా విజయవాడ జిల్లా గన్నవరం నియోజకవర్గంలోని అంబాపురంలో జరుగుతున్న కోడి పందేలకు మూడు రోజుల క్రితం మండలంలోని వివిధ గ్రామాల నుంచి నాయకులు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి, మండల నాయకులు సుధాకర్ రెడ్డి, వైసీపీ నాయకులు చంద్రపెద్ద స్వామి, మద్దయ్య, కటారుకొండ వెంకటేశ్వరరెడ్డి, పుసులూరు ప్రభాకర్ రెడ్డి తదితరులు తరలివెళ్లారు. మండలంలోని పాలకొలను, గుట్టపాడు, ఓర్వకల్లు, నన్నూరు, హుశేనాపురం, తిప్పాయపల్లె తదితర గ్రామాల నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు తరలివెళ్లి కోళ్ల పందేలను తిలకించారు.


కోడి పందేల్లో నాయకులు

ఘనంగా సంక్రాంతి సంబరాలు

సంక్రాంతి పండుగను జిల్లాలో ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం నుంచి మంగళవారం వరకు వరుసగా భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను వైభవంగా నిర్వహించారు. గ్రామాల్లో వివిధ పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

ఆదోని(అగ్రికల్చర్), జనవరి 16: ఆదోని పట్టణంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు పలు చోట్ల ముగ్గుల పోటీలు నిర్వహించారు. సీఆర్ నగర్‌లో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు మహిళలు భారీగా తరలి వచ్చారు. విజేతలకు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సీపీఐ పట్టణ నాయకుడు సుదర్శన్, ఏఐవైఎఫ్ నాయకుడు రమేష్ కుమార్, అంజిత్ గౌడ్ బహుమతులు ప్రదానం చేశారు.

ఆలూరు: మండలంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఇళ్ల ముందు రంగు రంగుల ముగ్గులు వేశారు.

హాలహర్వి: మండలంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు ఇళ్ల వద్ద ముగ్గులు వేశారు.

పత్తికొండటౌన్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సోమవారం మండలంలోని దూదేకొండ గ్రామంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు ఘనంగా జరిగాయి. స్థానిక గ్రామ ఎంపీటీసీ ఈరన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు పెద్దఎత్తున మహిళలు తరలి వచ్చి పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి వరుసగా పద్మావతికి రూ.3,016, మల్లేశ్వరి రూ.2,016, శిరీషకు రూ.1,016, రాధమ్మకు రూ.516 నగదును అందజేశారు. ఈ పోటీల్లో న్యాయనిర్ణేతలుగా ఎస్టీయూ నాయకుడు సత్యనారాయణ, చంద్రశేఖర్, బలరాముడు, చంద్రశేఖర్‌రెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో గ్రామస్థులు కుంపటి నరసింహులు, పెద్దము నెయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: సంక్రాంతి పండుగను అంగరంగా వైభవంగా నిర్వహించుకున్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మహిళలు ఇళ్ల ఎదుట అందమైన ముగ్గులు వేయడంతో పాటు రంగులు అద్ది గొబ్బెమ్మలను పెట్టారు. యువకులు గాలిపటాలను ఎగురవేశారు. గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.

మద్దికెర: మండలంలోని మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం తదితర గ్రామాల్లో మకర సంక్రాంతి, కనుమ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మకర సంక్రాంతిలో భాగంగా మండలంలోని పెరవలి గ్రామంలో శ్రీరంగనాథస్వామి ఆలయంలో మూలవిరాట్ రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు చేసి సాయంత్రం రంగనాథస్వామి భూదేవి, శ్రీదేవి సతీసమేత విగ్రహాలను పల్లకీలో వీధుల గుండా ఊరేగించారు.

ఎమ్మిగనూరు: పట్టణంతోపాటు గ్రామాల్లో సంక్రాంతి పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని గాంధీనగర్, ఎస్ఎంటీ కాలనీ, మునెప్ప నగర్, ఎంఎస్ నగర్, లక్ష్మీపేట, ముగతిపేట, వీవర్స్ కాలనీ, హెచ్‌బీఎస్ కాలనీ, శిల్పా ఎస్టేట్, రాఘవేంద్ర నగర్, పాత 11వ వార్డు, వెంకటాపురం కాలనీలతో పాటు ఆయా ప్రాంతాల్లో మహిళలు పర్వదినాన్ని పురస్కరించుకొని ఇళ్ల ముందు ముగ్గులు వేశారు. స్థానిక నీలకంఠేశ్వర స్వామి ఆలయంలోనూ, తేరుబజారులోని మార్కండేయ స్వామి ఆలయంలోనూ, కోటా వీధిలోని ఈశ్వర స్వామి ఆలయంలోనూ, అన్నమయ్య సర్కిల్‌లోని సాయి ఆలయంలోనూ, వీవర్స్ కాలనీలోని రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

టీడీపీ సూపర్ 6 పథకాలతో ముగ్గులు: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఎమ్మిగనూరు పట్టణంలోని 3వ వార్డులో టీడీపీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు వార్డు ఇన్‌చార్జి చేనేత మల్లి ఆధ్వర్యంలో ముగ్గులను సోమవారం వేయించారు. స్థానికంగా ఉన్న ఇరువురు బాలికలు టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను వివరిస్తూ సూపర్6 పథకాలు అన్నదాతకు రూ.20వేలు, తల్లికి వందనం ఏడాదికి రూ.15వేలు, ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితం, నిరుద్యోగ భృతి నెలకు రూ.3వేలు, ఆడబిడ్డ నిధికి నెలకు రూ.1500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలను తెలియజేసే ముగ్గులను వేసి అలరించారు. అందంగా, ఆకర్షణీయంగా సూపర్ 6 పథకాలపై రంగు వల్లులు వేసిన ఇరువురు బాలికలకు టీడీపీ నా యకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాందాసుగౌడు, దయాసాగర్, మైనార్టీసెల్ తాలుకా అధ్యక్షుడు ఉసేన్‌పీరా, మాజీ కౌన్సిలర్లు ముల్లాఖలీముల్లా, రామకృష్ణనాయుడు, నరసింహులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: గ్రామాల్లో సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని చింతలాముని నల్లారెడ్డి స్వామి, ఈశ్వరదేవాలయం, సీతారామాంజినేయ స్వామి దేవాలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● చింతలాముని నల్లారెడ్డి దేవాలయం ప్రాంగణంలో దేవాలయ కమిటీ అధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీల విజేతలకు ఆలయ అర్చకులు, గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి బహుమతులును ప్రదానం చేశారు.



పత్తికొండ: దూదేకొండలో ముగ్గుల పోటీలను తిలకిస్తున్న ప్రజలు



ఆదోనిలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు



ఎమ్మిగనూరులో..

మొదటి బహుమతిని సింధుజకు బ్రీఫ్‌కేస్, రెండో బహుమతిని గాయత్రికి డిన్నర్‌సెట్, మూడో బహుమతిని శైలజకు హట్‌బాక్స్‌లను అందజేశారు.

చంద్రబాబుతోనే పేదలకు న్యాయం



పెరవలిలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

మద్దికెర, జనవరి 16: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే పేదలకు న్యాయం జరుగుతుందని, ఆయనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలుగు యువత మండల ఉపాధ్యక్షుడు మూలింటి రాముయాదవ్, టీడీపీ నాయకులు మూలింటి రంగస్వామి అన్నారు. మంగళవారం మండలంలోని పెరవలి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను అందజేశారు. సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు తెలియజేశారు. వైసీపీ అరాచక పాలనకు పతనం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మంగళి రంగస్వామి, ఉప్పర ఈరప్ప, శ్రీరాములు, మెడికల్ శ్రీరాములు, ఖలీల్, గంగబాషా, అయ్యప్ప పాల్గొన్నారు.

దేవనకొండ: అధోగతిపాలైన ఏపీ భవిష్యత్తుకు చంద్రబాబే భరోసా అని ఐటీడీపీ, టీడీపీ నాయకులు రామాంజినేయులు, శ్రీనివాసులు, హనుమంతు, నాగరాజు, ఈ. కిష్టన్న అన్నారు. సోమవారం మండలంలోని పల్లెదొడ్డి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రరాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన జగన్‌ను ఇంటికి పంపాలన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు.

పందికోనలో టీడీపీ ఫ్లెక్సీ ధ్వంసం

పత్తికొండ, జనవరి 16: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు ఫోటోలతో గ్రామనాయకులు ఏర్పాటు చేసుకున్న టీడీపీ ఫ్లెక్సీని గుర్తుతెలియని దుండగులు బ్లేడ్లతో కోసి పెట్రోల్‌పోసి నిప్పంటించారు. పత్తికొండ మండల పరిధిలోని పందికోన గ్రామంలో సోమవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. టీడీపీ మండల అధ్యక్షుడు కడవల సుధాకర్ తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 25న పత్తికొండలో రా కదలిరా చంద్రబాబు పర్యటనకు మద్దతుగా గ్రామంలో బస్టాండ్ సమీపంలో ఓ ఇంటికి భారీఫ్లెక్సీని ఏర్పాటు చేశాము. గుర్తుతెలియని దుండగులు బ్లేడ్లతో చించి పెట్రోల్ పోసి తగలబెట్టారు. పోలీస్‌స్టేషన్‌లో సంఘటనపై ఫిర్యాదు చేశామని కడవల సుధాకర్ వివరించారు.

కురువలు రాజకీయంగా ఎదగాలి

మద్దికెర, జనవరి 16: కురువలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని సంఘం నాయకుడు లక్ష్మీనారాయణ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గడ్డం రామాంజినేయులు, మండల తెలుగుయువత అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, నియోజకవర్గం నాయకుడు శ్రీరాములు అన్నారు. మంగళవారం మద్దికెరలో 2024 క్యాలెండర్‌ను కురువ సంఘం నాయకులు విడుదల చేశారు. కార్యక్రమంలో గుడి యల్లప్ప, టైలర్ హరి పాల్గొన్నారు.

వలసల నివారణలో ప్రభుత్వం విఫలం

ఆదోని టౌన్, జనవరి 16: వలసలను నివారించడంలో ప్రభుత్వం విఫలమైందని రాయలసీమ కో-ఆర్డినేషన్ కమిటీ (ఆర్‌సీసీ) గౌరవ అధ్యక్షుడు ఏసీ శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వలసల విషయంలో జిల్లా మొదటి స్థానంలో ఉందని, జలయజ్ఞం ద్వారా పొలాలకు నీరు అందించడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో ఎండీ భద్రీనాథ్ స్వామి, కన్నె జగదీష్ పాల్గొన్నారు.

కబడ్డీ విజేతలకు బహుమతి ప్రదానం

ఆస్పరి, జనవరి 16: మండల కేంద్రమైన ఆస్పరిలో గత కొన్ని రోజులుగా నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలో విజేతలైన మూడు జట్లకు మంగళవారం స్థానిక యూత్ నాయకుల బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ విజేత గోనెగండ్ల జట్టుకు వైసీపీ ఆలూరు ఇన్‌చార్జి విరుపాక్షి రూ.20,116, ద్వితీయ విజేత తంగరడోణ జట్టుకు గ్రంథాలయ మాజీ చైర్మన్ శంకర్ రెడ్డి కుమార్తె మిథునా రెడ్డి రూ.10,116, మూడో విజేత శంకర బండ జట్టుకు ఆస్పరి గ్రామానికి చెందిన బోర్‌వెల్ నిర్వాహకుడు మేకల రంగనాథ్ రూ.5,116 ప్రదానం చేశారు. కార్యక్రమంలో కట్టెల నారాయణ, రామకృష్ణ, అరవిందు, మహేష్, విజయ్, సంజన, యూత్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం

కౌతాళం, జనవరి 16: ప్రజలు వలసలు వెళ్లకుండా ఉండేందుకు ఉపాధి పనులు కల్పిస్తామని ఏపీఓ జుబేరర్ అహ్మద్ తెలిపారు. నదిచాగి గ్రామంలో మంగళవారం ఉపాధి పనులకు ఫీల్డ్ అసిస్టెంట్ రామన్న గౌడ్ కూలీలకు ఉపాధి పనులను ప్రారంభించారు. కూలీలకు ప్రతిరోజు ప్రభుత్వం సూచించిన విధంగా రోజుకు రూ.272 దినసరి కూలీ కల్పిస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా మకరజ్యోతి దివ్య దర్శనం

ఆదోని(అగ్రికల్చర్), జనవరి 16: పట్టణంలోని సదాశివ నగర్‌లో వెలసిన శబరి అయ్యప్ప స్వామి ఆలయంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని అయ్యప్ప మాలధారణ స్వాములకు మకరజ్యోతి దివ్య దర్శనాన్ని కల్పించారు. ఆలయంలో 18 మెట్లపై పుష్పాలంకరణ చేసి పడిమెట్లను వెలిగించి మహా మంగళహారతి చేపట్టారు. అనంతరం కేరళ అయ్యప్పస్వామి దివ్య దర్శనం కల్పించారు. కార్యక్రమంలో గురుస్వామి మల్లికార్జున, గురుస్వామి దేవేంద్ర, మాలధారణ స్వాములు సుబ్బన్న, వెంకటేశులు, లవకుమార్, భానుప్రకాష్, రంగస్వామి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

హాలహర్వి, జనవరి 16: మండలంలోని బాపురం గ్రామానికి చెందిన చంద్రబాబు (30) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. రెండు రోజుల క్రితం కారేకల్లు ఫ్యాక్టరీలో విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై వస్తుండగా అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడు. స్థానికులు చికిత్స నిమిత్తం బళ్లారి ఆసుపత్రికి తీసుకెళ్లారు. మంగళవారం చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

బ్యాంకు ఉద్యోగి ఇంట్లో చోరీ

హాలహర్వి, జనవరి 16: హాలహర్వి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఉద్యోగి ఇంట్లో దొంగలు పడ్డారు. మంగళవారం ఎస్సై నాగేంద్ర మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగి అనిల్ కుమార్ మూడు రోజులు సెలవులపై వెళ్లారని పసిగట్టిన దొంగలు చోరీకి యత్నం చేశారు. తాళాలు పగలకొట్టి ఇంట్లో ఉన్న ల్యాప్‌టాప్, వాచీలు తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యూటీఎఫ్ సీనియర్ నాయకుడి మృతి

వెల్దుర్తి, జనవరి 16: యూటీఎఫ్ సీనియర్ నాయకులు, ఉపాధ్యాయుడు ఎన్‌వి. శేషారెడ్డి అనారోగ్యంతో కన్నుమూశారు. సోమవారం స్వగ్రామమైన వెల్దుర్తిలో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు యూటీఎఫ్-సాహితీ స్రవంతి రాష్ట్రనాయకులు, యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు హాజరై నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్ మాట్లాడుతూ నిబద్ధతగల నాయకుడిగా సంఘానికి విశేష సేవలందించారన్నారు. క్రిష్ణగిరి మండలంలో యూటీఎఫ్ అభివృద్ధికి నిర్విరామ కృషిచేశారని కొనియాడారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా అంకితభావంతో విధులు నిర్వర్తించారని, ఎవరికీ ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కారం చేసేవారని, మండలంలో ప్రాబ్లం షూటర్‌గా ఆయనకు పేరుందని గుర్తుచేసుకున్నారు.

నిబంధనలు పాటించని ఎంఈఓ సునంద

ఉపాధ్యాయుడు చనిపోతే జీవోనెం.35 22 ప్రకారం అంత్యక్రియలకు రూ.25 వేలు ఇవ్వాలి. అధికారి రాలేని పక్షంలో విద్యాశాఖ తరపున డబ్బు పంపి ఆ తర్వాత క్లైయిమ్ చేసుకునే అవకాశం ఉంది. అయితే ఎంఈఓ సునంద మాత్రం ఈవేమి పట్టించుకోలేదు. కనీసం ఆనవాయితీ ప్రకారం భౌతికకాయాన్ని దర్శించాలి. అసలు తమకేమి పట్టనట్లు ఎంఈఓ వ్యవహరించిందని క్రిష్ణగిరి, వెల్దుర్తి మండల ఉపాధ్యాయులు వాపోయారు.

అంగన్‌వాడీలకు అన్యాయం చేస్తున్న జగన్

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 16: ఎమ్మిగనూరులో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన సమ్మె మంగళవారంతో 36వ రోజుకు చేరింది. 35వ రోజు సోమవారం సంక్రాంతి పండుగ రోజున అంగన్‌వాడీ కార్యకర్తలు సోమప్ప సర్కిల్‌లో రోడ్డుపై 'సీఎం గారు మా వేతనాలు పెంచండి' అంటూ ముగ్గువేసి తమ నిరసనను తెలిపారు. అలాగే మంగళవారం మోకాళ్లపై కూర్చొని తమ నిరసనను తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు కృష్ణవేణమ్మ, శైలజ, నీరజ, గోవర్ధనమ్మ, నాగవేణి, నాగలక్ష్మి, అరుణ, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు అంజిబాబు, రాముడు, తిమ్మగురుడు, రాజు, ప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ఆస్పరి: అంగన్‌వాడీలపై దుర్మార్గంగా వ్యవహరిస్తున్న జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలంటూ మండల కేంద్రంలో ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు 36వ రోజు నిరవధిక సమ్మె మంగళవారం నిర్వహించారు. ఏఐటీయూసీ మండల కార్యదర్శి కృష్ణమూర్తి, సీఐటీయూ మండల కార్యదర్శి రామాంజిని మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వేతనాలు పెంచకుండా వైసీపీ ప్రభుత్వం ఆలస్యం చేస్తుందని, త్వరలో వైసీపీ ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల గౌరవ అధ్యక్షుడు బాలక్రిష్ణ, రైతు సంఘం నాయకులు రంగస్వామి, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ నాయకురాలు చిట్టెమ్మ, ఛాయాదేవి, రాణి, గీతావాణి, సువర్ణ, రూతమ్మ, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

ఆలూరు: అంగన్‌వాడీలపై ప్రభుత్వం చిన్నచూపు తగదని సీఐటీయూ జిల్లా నాయకులు నారాయణ స్వామి, కృష్ణ అన్నారు. స్థానిక బస్టాండ్‌లో అంగన్‌వాడీ ఉద్యోగుల నిరసన 36వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మోకాలిపై నిల్చొని నిరసన తెలిపారు.

మంత్రాలయం: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని అంగన్‌వాడీ వర్కర్ల అధ్యక్షురాలు విశాలాక్షి, భీమేశ్వరి, ప్రమీల, సీఐటీయు మండల కార్యదర్శి జయరాజు, అంజిరాజు అన్నారు. మంత్రాలయం ఐసీడీఎస్ కార్యాలయం ముందు చేపట్టిన సమ్మె మంగళవారానికి 36 రోజులు సాగింది. కార్యక్రమంలో తులసమ్మ, నరసమ్మ, అనిత, మాధురి, లావణ్య, నాగవేణి, మీనాక్షి, అయ్యమ్మ, భారతి, ఇందిరమ్మ, సుందరమ్మ, ఉమామహేశ్వరి, ద్రాక్షాయణి పాల్గొన్నారు.

వెల్దుర్తి: పట్టణంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సంక్రాంతి పండుగ రోజు, మంగళవారం కనుమ రోజు కూడా పట్టువదలకుండా వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాలకు చెందిన అంగన్వాడీలు తమ నిరసనలు తెలిపారు. మంగళవారం అంగన్వాడీ వర్కర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ హాజరై మాట్లాడారు. ప్రభుత్వం సమ్మెను నీరుగార్చేందుకు ఎస్మా చట్టాన్ని తెచ్చి భయపెట్టే ప్రయత్నం చేస్తోందని, ప్రభుత్వం ఎన్ని కుట్రలకు, కుతంత్రాలకు పాల్పడినా భయపడేదిలేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సుశీలమ్మ, ఆలీంబీ, మాణిక్యమ్మ, సుకన్య, రేఖ, మాధవి, జయమ్మ, ముంతాజ్, మద్దమ్మ పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



మంత్రాలయంలో..

మీటర్లు బిగిస్తే పగలగొడతాం

రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రయ్య



మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

పత్తికొండటౌన్, జనవరి 16: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించే విధానాన్ని విరమించుకోవాలని, ఒకవేళ పంపుసెట్లకు మీటర్లు బిగిస్తే పగలగొడుతామని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రయ్య, నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు కారన్న, అధ్యక్షుడు వీరన్న హెచ్చరించారు. మంగళవారం స్థానిక సీఆర్ భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి రైతులపై భారం పడే విధంగా వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించే విధానానికి పూనుకోవడం సమంజసం కాదన్నారు. కరువు ఛాయలలో తల్లడిల్లిపోతున్న రైతులు ఏటేటా అప్పుల ఊబిలో కూరుకుని పోయి ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతూ ఉంటే సీఎం రైతులపై భారం పడేలా రైతు వ్యతిరేక విధానాలను తేవడం అన్యాయమని పేర్కొన్నారు.

నేడు ఎమ్మిగనూరుకు కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడి రాక

ఎమ్మిగనూరు, జనవరి 16: బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షు చిగురుపాటి కుమార స్వామి రానున్నారు. కర్నూలులో జరిగే కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గానికి హాజరవుతున్నారు. అలాగే ఎమ్మిగనూరులో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బీఎస్ ఈరన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిసాన్‌మోర్చ కార్యాలయాన్ని రాష్ట్ర అధ్యక్షుడు కుమార స్వామి ప్రారంభించనున్నారు.

రామ మందిర చిత్రపటాల పంపిణీ

ఆస్పరి, జనవరి 16: మండల కేంద్రమైన ఆస్పరిలో బీజేపీ మండల కో-కన్వీనర్ గోవిందరాజుల స్వామి, కర్ణ, నారాయణ ఆధ్వర్యంలో మంగళవారం రామ మందిర చిత్రపటాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన సీఐ హనుమంతప్పను ఘనంగా సన్మానించి, రామ మందిర చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఓబీసీ మండల అధ్యక్షుడు నాగరాజు, రవి, రామదాసు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు

మద్దికెర, జనవరి 16: మద్దికెర గ్రామంలో ఇంటింటికీ అయోధ్య శ్రీరాముడి అక్షింతలు పంపిణీ చేస్తున్నట్లు విశ్వహిందూపరిషత్ మండల అధ్యక్షుడు భూషణం, మండల కార్యదర్శి రామాంజినేయులు, బండారు సంజీవరావు అన్నారు. మంగళవారం స్థానిక ఎస్సీ కాలనీలోని బ్రహ్మయ్యస్వామి దేవాలయంలో అయోధ్య అక్షింతలకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బండారు సంజీవరావు, బొంబాయి రామాంజులు, పెద్ద అంజనేయులు, విష్ణు, యూసూఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ వీడి ప్రశాంతంగా జీవించాలి



వెలమకూరు ప్రజలతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు

దేవనకొండ, జనవరి 16: గ్రామాల ప్రజలు ఫ్యాక్షన్ వీడి ప్రశాంతంగా జీవించాలని సీఐ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలంలోని వెలమకూరు గ్రామంలో ఆయన పర్యటించారు ఫ్యాక్షన్ వల్ల జీవితాలు నాశనం అవుతాయన్నారు. పెరుగుతున్న అధునిక కాలంలో అభివృద్ధితో పోటీపడాలని, పిల్లలకు మంచి విద్యని అందిస్తే గ్రామాలు ఫ్యాక్షన్ వీడి అభివృద్ధి వైపు అడుగులు పడుతాయని పేర్కొన్నారు.

వైభవంగా శాంతిహోమం

మద్దికెర, జనవరి 16: మద్దికెర గ్రామంలోని మద్దమ్మకుంటలో సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో మంగళవారం శాంతిహోమం, గ్రామ దేవత మద్దమ్మవ్వకు పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహ కులు విజయప్రసాద్, అర్చకుడు మహేష్ ఆధ్వర్యంలో హోమాలు, పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

తుగ్గలి, జనవరి 16: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బీసీవైఎం నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, కౌలుట్ల అన్నారు. మంగళవారం మండలంలోని మారెళ్లలో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో గెలుపొందిన ఎద్దులదొడ్డి జట్టుకు దాత బీసీవైఎం నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు యాదవ్ మొదటి బహుమతి రూ.50వేలును అందించారు. అలాగే ద్వితీయ స్థానంలో నిలిచిన మారెళ్ల జట్టుకు శివ దాబా యజమాని నరేష్ గౌడ్ రూ.30వేలు, మూడో బహుమతి మద్దికెర జట్టుకు దాత వెంకటేశ్వర్లుగౌడ్ రూ.20వేలు అందించారు.

షర్మిల నియామకంపై హర్షం

ఆదోని టౌన్, జనవరి 16: వైఎస్ షర్మిలను ఏపీపీసీ రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమిస్తూ ఏఐసీసీ జనరల్ సెక్రటరీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేయడంపై కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ నూర్ అహ్మద్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీ పగ్గాలు చేపట్టడంతో రాష్ట్రంలో పార్టీ బలం పుంజుకోవడం ఖాయమన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మద్దికెర, జనవరి 16: మద్దికెరలో బుధవారం బేతేయిల్ క్రిస్టియన్ ఆపద్బాంధవ సేవాసంస్థ ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలోని బేతేయిల్ చర్చిలో ఉచిత గుండె వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆపద్బాంధవ సేవాసంస్థ అధ్యక్షుడు చొక్కా సునీల్‌కుమార్, రాజశేఖర్, మధు, రాజు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఈ శిబిరానికి వచ్చే వారు ఆధార్‌కార్డు తీసుకుని రావాలని సూచించారు.

గుడికల్‌లో గిరకబండి లాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న గ్రామ పెద్దలు

ఎమ్మిగనూరు, జనవరి 16: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గుడికల్ గ్రామంలో గిరకబండి లాగుడు పోటీలను గ్రామపెద్దలు వై రుద్రగౌడ్, వై పురుషోత్తం గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీలలో 28జతల ఎద్దులు పాల్గొన్నాయి. ఇందులో మెదటిస్థానంలో నందవరం మండలం హాలహర్వి గ్రామానికి చెందిన ఈరన్న వృషభాలు నిలిచి రూ. 30వేలు బహుమతిని గెలుచుకున్నాయి. అలాగే ద్వితీయ స్థానంలో పత్తికొండ మండలం పులికొండ గ్రామానికి చెందిన రంగన్న నాయుడు వృషభాలు రూ.25వేలు, ఆస్పరి మండలం వలగొండ గ్రామానికి చెందిన ఈరన్న వృషబాలు తృతీయ బహుమతిని రూ.20వేలు, దేవరకొండ మండలం పాలకుర్తి గ్రామానికి చెందిన అల్లాబకాష్ వృషభాలు చతుర్థబహుమతి రూ.15వేలు గెలుచుకున్నాయి. పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానులకు గ్రామ పెద్దలు వై. రుద్రగౌడు, పురుషోత్తంగౌడు, డాక్టర్ గౌడప్ప గౌడు, కుమార్‌గౌడులు నగదు బహుమతులను అందజేశారు.

టీడీపీ నాయకుడి మృతి



నరసింహులు(ఫైల్)

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 16: ఎమ్మిగనూరు మండల పరిధిలోని కలుగొట్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు, అడ్వకేట్ నరసింహులు(56) అనారోగ్యంతో మృతి చెందాడు. నరసింహులు గత కొంతకాలంగా బెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్నాడు. కర్నూలు వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడికి ఒక భార్య, ఒక కుమార్తె ఉన్నారు. నరసింహులు మృతికి మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసింహులు మృతి పార్టీకి తీరనిలోటు అని, ఆయన కుటుంబానికి టీడీపీ ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు.

టీడీపీ కార్యకర్త...

ఎమ్మిగనూరు పట్టణంలో: ఎమ్మిగనూరు పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త దర్జి మోషన్న (55) సోమవారం మృతి చెందారు. మోషన్నకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కుటుంబ సభ్యులు కర్నూలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతుడికి భార్య, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. మోషన్న అంత్యక్రియలను మంగళవారం ఎస్సీ శ్మశాన వాటికలో నిర్వహించారు. టీడీపీ నాయకులు సుధాకర్‌శెట్టి, కదిరికోట ఆదెన్న, అల్తాఫ్, ఉప్పర ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్ మాచాని శివకుమార్, ముగతి వీరారెడ్డి, కందనాతి శ్రీనివాసులు మోషన్న భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

టీడీపీ కార్యకర్తల కుటుంబానికి అండగా ఉంటాం

మంత్రాలయం, జనవరి 16: మంలంలోని చెట్నహళ్ళి గ్రామానికి చెందిన టీడీపీ గ్రామ అధ్యక్షుడు తిక్కస్వామిగౌడు అన్న కొడుకు వేణుగోపాల్ గౌడు (55) గుండె పోటుతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ ఇన్‌చార్జి తిక్కారెడ్డి సోదరుడు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి మృతదేహనికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు ఎటువంటి ఆపద, కష్టం వచ్చినా అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ పన్నగ వెంకటేష్‌స్వామి, ఎల్లారెడ్డి, బీసీసెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్నాథ్‌రెడ్డి, విజయరామిరెడ్డి, బెస్త ఈరన్న, పూజారి మల్లేష్, నరసింహులు, సీఆర్‌పీ నరసన్నగౌడు, రామదాసు, రవి, లక్ష్మయ్య, వీరేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి

» ఇబ్బందుల్లో ప్రజలు » పట్టించుకోని అధికారులు



చిన్నహ్యాటలో ఖాళీ బిందెలతో గ్రామస్థులు

హొళగుంద, జనవరి 16: హొళగుంద మండలం చిన్నహ్యాట, పెద్దహ్యాట, బొమ్మ గుండనహళ్లి గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తింది. పంచాయతీ అధికారులు పది రోజులకు ఒకసారి నీటి సరఫరా చేస్తున్నారని, అత్యవసరంగా నీరు కావాలంటే మూడు కిలోమీటర్లు దూరం వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్థులు వాపోతున్నారు. ఈవిషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాంనీలాను వివరణ కోరగా మా సిబ్బందికి చెప్పి సమస్యను వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు.